నవతెలంగాణ
1
ఆదిలాబాద్
శనివారం | డిసెంబర్ 16, 2023 | www.navatelangana.com

ఆరెగూడలో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని మోసం గ్రామపంచాయతీ ఆరెగూడ గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువుల్లో పునరుత్పాదకత, ఉచిత చికిత్సల్లో భాగంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.విజయ్ తిమ గర్భధారణ, గర్భకోశ సమస్యలు, ఎందకు రాకపోవడం, సుడి నిలువకపోవడం, ఈసుకు పోవడం తదితర వ్యాధలను గుర్తించి చికిత్స అందించారు. మొత్తం 65 గేదెలు, 72 ఆవులకు గర్భకోశ చికిత్సలు,110 ఎడ్లకు, 73 మేకలకు సాధారణ చికిత్సలు నిర్వహించినట్టు డాక్టర్ విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, పంచాయితీ కార్యదర్శి రాజేశ్వరి, ఎఫ్‌ఏరవి, రాస్పెల్లి పశువైద్య సహాయకుడు రాజ్ కుమార్, జిల్లా గోపాల మిత్రల సూపర్‌వైజర్ రమేష్, గోపాల మిత్రలు జమీర్, రమేష్ బాబు, భాస్కర్, నామ్ దేవ్, పశుపోషకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక విద్యార్థినులు

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో చదువుతున్న నలుగురు హ్యాండ్ బాల్ క్రీడాకారులు ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి 14 సంవత్సరాల బాలికల హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానపాధ్యాయుడు కృష్ణారావు, జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల స్పోర్ట్స్ ఆఫీసర్ బండ మీనారెడ్డి తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిలు సత్యభామ, కవిత, ముత్తుబాయ్, శిరీషలను గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయికి పోటీలకు జిల్లా క్రీడ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి ఉదయబాబు, జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి సాంబశివ రావు, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కనపర్తి రమేష్, ఏసీఎంఓ పి.ఉద్ధవ్, ఏటీడీఓలు క్షేత్రయ్య, కమర్ హుస్సేన్, జీసీడీఓ శకుంతల, క్రీడ పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, పీఈటీ రాకేష్, హెచ్ డబ్ల్యూఓ విజయశాంతి పాల్గొన్నారు.

బస్సులు ఎరుగని పల్లెలు

• ఉమ్మడి జిల్లాలో అనేక గ్రామాలకు వెళ్లని వైనం • ఇప్పటికీ ఎడ్లబండ్లు..ప్రయివేటు వాహనాలే దిక్కు • అనేక మంది అతివలకు మహాలక్ష్మీ పథకం దూరం

స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు గడిచినా.. అనేక పల్లెలు ఆర్టీసీ బస్సులు ఎరగడం లేదు. కొన్ని గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు ఎక్కిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవులు, కొండలు, మారుమూల ప్రాంతాలు ఉండటంతో వందలాది పల్లెలకు బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 100కు పైగా గ్రామాలకు ఆర్టీసీ బస్సు వెళ్లడం లేదని అధికారవర్గాలు చెబుతుండగా.. ఉమ్మడి జిల్లాలో ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుందని తెలుస్తోంది. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటికీ రవాణా సౌకర్యం కోసం ఎడ్లబండ్లు, ప్రయివేటు వాహనాలు ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని చోట్ల రోడ్డు సౌకర్యం ఉన్నా..ఆర్టీసీ సంస్థ బస్సులను నడిపించేందుకు ముందుకు రావడం లేదు. ఫలితంగా పల్లె వెలుగు బస్సులు పేద ప్రజలకు ఉపయోగపడని విధంగా మారుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అతివల కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం అనేక మందికి ఉపయోగపడని విధంగా మారింది.



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతానికి వెళ్లే దారి ఉంది. ఇటువైపు పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. పండగ సందర్భాల్లో మాత్రమే బస్సు నడిపించిన అధికారులు అనంతరం నిలిపివేశారు. దీంతో అటువైపు గ్రామాల ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు రావాలంటే ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.ఇలాంటి గ్రామాలు ఉమ్మడి జిల్లాలో వందలాదిగా ఉండటం గమనార్హం.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 వరకు గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి అనుబంధంగా వందలాది గ్రామాలు ఉన్నాయి. వీటిలో చాలా గ్రామాలకు ఆర్టీసీ సంస్థ పల్లెవెలుగు బస్సులను నడిపిస్తుండగా.. ఇంకా వందలాది గ్రామాలు ఈ సౌకర్యానికి దూరంగా ఉన్నాయి. అడవుల జిల్లా కావడంతో కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం బాగా లేదనే కారణంగా బస్సులు నడిపించకపోగా.. మరికొన్నింటికీ రోడ్డు సౌకర్యం బాగున్నా..అక్యూపెన్సీ రాదనే కారణంగా వీటిని నడిపించేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికీ ఆయా గ్రామాల ప్రజలు జిల్లా, మండల కేంద్రాలకు రావాలంటే ఎడ్లబండ్లు, ఆటోలు, జీపులు ఇతర వాహనాల ద్వారా రావాల్సి వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన సిరికొండ మండలంలోని 52 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఇచ్చోడ, బజార్‌హత్నూర్, తాంసి, దహెగాం, తిర్యాణీ తదితర మారుమూల మండలాల్లోని మెజార్టీ గ్రామాలకు బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉంది. నేరడిగొండ మండలంలో పేరుగాంచిన కుంటాల జలపాతంతో పాటు అనేక గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదు. బేల,గాదిగూడ తదితర మండలంలోని గూడెలు, తండాలు ఇప్పటికీ ఆర్టీసీ బస్సులు ఎరగడం లేదు. ఇలా ఉమ్మడి జిల్లాలోని అనేక పల్లెలు ఆర్టీసీ బస్సులకు దూరంగా ఉంటున్నాయి.

మహాలక్ష్మీ పథకానికి దూరం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజియన్‌లో ఆరు డిపోలు ఉండగా వీటి పరిధిలో 600బస్సులు ఉన్నాయి. ఇందులో 487 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తున్నాయి. వీటి పరిధిలో రోజూ సుమారు 1.50లక్షల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం సాగిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహిళల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. కానీ అనేక పల్లెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో చాలా మంది మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. వీరు బస్సు ఎక్కాలంటే వారి ఊరు నుంచి ఎడ్లబండి లేదంటే ప్రయివేటు వాహనాల్లో మండల కేంద్రాలకు వచ్చి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. ఇది వరకు కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ.. అంతగా ప్రయాణికులు ఎక్కడం లేదనే కారణంగా అధికారులు మధ్యలోనే వాటిని నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టినప్పటికీ నిరుపేద మహిళలకు ఎలాంటి ప్రయోజనం లేకుండాపోతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యపై ఆర్టీసీ అధికారులు సైతం దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో నిలిపివేసిన మార్గాల్లో మళ్లీ పునరుద్ధరించే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

గ్రామాల వివరాలు సేకరిస్తున్నాం

సోలోమాన్, ఆర్టీసీ ఆర్ఎం



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాల వివరాలను సేకరిస్తున్నాం. గతంలో నడిపించి..వివిధ కారణాలతో నిలిపివేసిన వాటి గురించి తెలుసుకుంటున్నాం. బస్సులు వెళ్లేందుకు సరైన మార్గాలు ఎన్ని ఉన్నాయో తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అక్కడ్నుంచి ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు ప్రారంభిస్తాం.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. డీఆర్‌ఓ కదం సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా ఆశ్రమ పాఠశాలలో హాస్టల్స్‌లో విద్యార్థులు అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా కెరమెరి మండలంలోని బాబాఝురి ఆశ్రమ పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 132 మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారని, పాఠశాలకు 5 తరగతి గదులు అవసరం ఉండగా కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయన్నారు. దీని వలన విద్యార్థులు ఇరుకు గదులలో ఉండి విద్యను అభ్యసిస్తున్నారన్నారు. జిల్లాలో చలి తీవ్రంగా ఉన్నందున విద్యార్థులకు సోలార్ వాటర్ హీటర్ల ద్వారా స్నానానికి వేడి నీరు అందించవలసి ఉండగా చాలా చోట్ల సోలార్ హీటర్లు పని చేయడం లేదన్నారు. దీని వలన విద్యార్థులు చలి నీటిలో ఇబ్బంది పడుతూ స్నానం చేస్తున్నారన్నారు. కొన్ని పాఠశాలలలో మెను ప్రకారం భోజనం పెట్టడం లేదని ఇలా పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనట్లయితే అందులోన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు గెడం టీకనంద్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు వద్దన్న వాళ్లకు ఓటు అడిగే హక్కు లేదు

• శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా



నవతెలంగాణ-జైపూర్

నిన్న మొన్నటి వరకు గుర్తింపు సంఘం ఎన్నికలు వద్దన్న వివిధ కార్మిక సంఘాలకు ఈ ఎన్నికల్లో ఓటు అడుగే హక్కు లేదని శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా అన్నారు. శుక్రవారం ఇందారం-ఏ కార్మికులతో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగులుగా చేరిన యువ కార్మికులు ఏఐటీసీ ప్రాతినిధ్యాన్ని బలపరుస్తున్నారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నిర్వహించాల్సిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను ఏఐటీయూసీ బీఎంఎస్ మినహా మిగతా కార్మిక సంఘాలు వద్దన్నాయని పేర్కొన్నారు. అలాంటి కార్మిక సంఘాలు ఈరోజు నిర్వహించబడుతున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులను ఓటు అడుగు హక్కు లేదని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ నిరంతరం పరితపించే ఏఐటీయూసీ నక్షత్రం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందారం-1ఏ పిట్ కార్యదర్శి చింతల నవీన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన గేటు మీటింగ్‌లో యువ గని కార్మికులు 50 మంది ఏఐటీసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీసీ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు జుట్టు రాములు నాగభూషణం, విజయ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

కాసిపేట గనిపై మైనింగ్ స్టాఫ్ సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట గనిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం మైనింగ్ స్టాఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ స్టాఫ్ ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించారు. ఆదివారం మందమర్రి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే జనరల్ బాడీ సమావేశానికి మైనింగ్ స్టాఫ్ అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. దింతో పాటు ఈ నెల 27న జరగబోయే యూనియన్ ఎలక్షన్‌లో ఏఐటీయూసీ చుక్క గుర్తుకు ఓట్లు వేయాలని, మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ కార్యదర్శి లక్ష్మినారాయణ, నాయకులు రాజేందర్, రీజియన్ మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి వంగరి రాజేశ్వర రావు, ఇన్‌ఛార్జి గోపతి సత్యనారాయణ, శ్రీహరి, మైనింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

నవతెలంగాణ-చింతలమానెపల్లి

మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన డోకె ప్రకాష్ రైతు తన వరిపొలం నుంచి శుక్రవారం ఉదయం ట్రాక్టర్లో వరిగడ్డి తీసుకోస్తున్న క్రమంలో పంట పొలాల్లో ఉన్న విద్యుత్ తీగలు, వరిగడ్డికి తగలడంతో ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా వెంటనే ట్రాక్టర్ను పక్కకు తీసుకెళ్లి ఆన్లోడ్ చేయడంతో, ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. రెండు ఎకరాల వరిగడ్డి మాత్రం పూర్తిగా దగ్ధం అయ్యింది.

బడి బయట పిల్లల సర్వే

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మారావుపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని లక్ష్మీపూర్, కోలంగూడ. గ్రామంలో బడి బయట పిల్లల గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ధర్మారావుపేట సీఆర్పీ మడావి తిరుపతి ఆధ్వర్యంలో సర్వే చేసి డ్రాపౌట్ పిల్లల వివరాలను నమోదు చేశారు. నలుగురు బడి బయట పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తప్పకుండా పాఠశాలలకు పంపాలని, పాఠశాలలో కల్పించే సౌకర్యాలను వివరించారు. సర్వేలో గుర్తించిన పిల్లలను ప్రబంద్ పోర్టల్లో వివరాలు నమోదు చేసి ప్రభుత్వ పాఠశాలలో వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్పించడం జరుగుతుందని సీఆర్పీ తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోలంగూడ పాఠశాల హెచ్ఎం సమ్మయ్య పాల్గొన్నారు.

ఆగని మెడికోల ఆందోళన..!

• విధులు బహిష్కరించి నిరసన
• ఘటనపై విచారణ చేపట్టిన ప్రత్యేక బృందం
• డీఎంఈకి నివేదిక.. తదుపరి చర్యలపై నిర్ణయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ మెడికోలపై బుధవారం రాత్రి కొందరు వ్యక్తులు కళాశాలలోకి చొరబడి విద్యార్థులపై దాడి చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ ఘటనకు రిమ్స్ డైరెక్టర్ కారణమంటూ విద్యార్థులు ఆరోపిస్తూ ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రిమ్స్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి చేపట్టిన నిరసన శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. డైరెక్టర్ ఛాంబర్ ఎదుట నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన తెలుపుతూ డైరెక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సాయంత్రం సమయంలోనూ రోడ్డు మీదకు వచ్చి నిరసన చేపట్టారు. డైరెక్టర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రిమ్స్‌కు వచ్చిన విచారణ కమిటీ

మెడికోలపై జరిగిన దాడి ఘటనకు పూర్తి వివరాలను తెలుసుకునేందుకు డీఎంఈ ఆదేశాలతో విచారణ కమిటీ రిమ్స్‌కు వచ్చింది. శుక్రవారం ఉదయం చేరుకున్న కమిటీ సభ్యులు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో పాటు మెడికోలు, ప్రొఫెసర్లు, వైద్యులతో విడివిడిగా విచారణ జరిపింది. వైద్య విద్యార్థులపై దాడి చేయడం, దానిని ప్రోత్సహించింది ఎవరు, ఎవరి ప్రమేయం ఉంది...? అనేది మాట్లాడి నివేదికను సిద్ధం చేశారు. డీఎంఈ నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రొఫెసరులు శివప్రసాద్, వీవీ రావ్‌లు వచ్చి వారి నివేధికను సిద్ధం చేసుకోని త్వరలో డీఎంఈకి అందించనున్నారు. ఇదిలా ఉంటే మెడికోలు మాత్రం ఘటనకు సంబంధించి విషయాలు కాకుండా ఇతర విషయాలు అడిగారని ఆరోపిస్తున్నారు. పారదర్శకంగా విచారణ జరగడం లేదని విమర్శించారు.

విచారణ పూర్తి చేశాం.. డీఎంఈకి నివేదిక అందజేస్తాం

రిమ్స్ ఘటనపై విచారణ పూర్తి చేశామని, నివేదికను డీఎంఈకి అందిస్తామని విచారణ కమిటీ సభ్యుడు శివప్రసాద్ తెలిపారు. రిమ్స్‌లో ఇటీవల జరిగిన దాడిపై డీఎంఈ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్టు తెలిపారు. అన్ని కోణాల్లో విచారించడం జరిగిందన్నారు. డైరెక్టర్‌తో పాటు విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్లను విడివిడిగా విచారించి వివరాలు సేకరించామన్నారు. అయితే విచారణ పారదర్శకంగా జరగలేదని మెడికోలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. పూర్తి పారదర్శకతతోనే తాము విచారణ చేశామన్నారు. నివేదికను డీఎంఈకి అందిస్తామన్నారు. తదుపరి చర్యలు డీఎంఈ తీసుకుంటుందన్నారు.

విచారణ తీరు సరిగాలేదు : మెడికోలు

విచారణ కమిటీ బుధవారం జరిగిన దాడికి సంబంధించిన విషయం గురించి కాకుండా ఇతర విషయాలపై చర్చించారని మెడికోలు ఆరోపించారు. ఈ సందర్భంగా జూడ అసోసియేషన్ రిమ్స్ అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ దాడికి సంబంధించిన విషయాలను వదిలి కమిటీ సభ్యులు ఇతర విషయాలను బాదితులను అడిగారన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పక్కన పెట్టి ప్రొఫెసర్లతో విచారణ చేస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయని ప్రశ్నించారు. ఆరోపణలు వచ్చిన వ్యక్తిని ముందు సస్పెండ్ చేసి తరువాత విచారణ చేస్తే తమకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చిన వారికి డైరెక్టర్ తప్పుడు సమాచారం ఇస్తూ తప్పంతా తమదనేలా చూపించారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ సేవలు కొనసాగిస్తున్నామని, న్యాయం జరగకపోతే ఆ సేవలను కూడా బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

స్ట్రక్చర్ సమావేశాల్లో శాశ్వత ఒప్పందాలు చేస్తాం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(ఎస్సీఈయూ-సీఐటీయూ)ను గెలిపిస్తే స్ట్రక్చర్ సమావేశాల్లో పూర్తిస్థాయి శాశ్వత ఒప్పందాలు చేస్తామని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. గతంలో ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్‌కు చేసుకున్న వన్ టైం సెటిల్మెంట్ వల్లనే నేడు మైనింగ్ సోదరులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అన్నారు. అందుకే ఈసారి మైనింగ్ స్టాప్ ట్రేడ్స్ మెన్ తమ యొక్క క్యాడర్ స్కీమ్, ఇతర సమస్యలపై పరిష్కారం కావాలంటే సీఐటీయూ ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అసలు గత ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి ఎక్కడ కూడా ఒక స్ట్రక్చర్ మీటింగ్ సైతం నిర్వహించలేదని, దీనిపై ప్రశ్నించాల్సిన ప్రాతినిధ్య సంఘంగా గెలిచి గుర్తింపు సంఘాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యతగల ఏఐటీయూసీ ప్రశ్నించకుండా, స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించకుండా, యాజమాన్యానికి అనుకూలంగా మారిందన్నారు. రాజకీయ జోక్యం లేని సింగరేణిని మనం చూడాలని కార్మిక వర్గ ప్రయోజనాలకై కార్మిక సంఘాలు ప్రశ్నిస్తాయని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలు యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయని సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల వరకు చూడటం జరిగిందన్నారు. సీఐటీయూగా అనేక పోరాటాలు చేస్తున్నామని, గెలుపుతో సంబంధం లేకుండానే గోదావరిఖనిలో మంచినీటికై పోరాటం చేసి వాటర్ ప్లాంట్ల ఏర్పాటు కృషి చేశామని, సీఎంపీఎఫ్ వడ్డీ రేటు సవరించి కార్మికులకు రూ.లక్షకు రూ.వెయ్యి చొప్పున మూడు సంవత్సరాలు దాదాపు రూ.30 నుంచి రూ.40 వేల వరకు వారి వారి సీఎం పిఎఫ్ అకౌంట్‌లో ఇప్పించామని అన్నారు. నేడు సొంతింటి కల గురించి అన్ని యూనియన్లు శాసన సభ ఎన్నికల్లో సైతం రాజకీయ పార్టీలను స్పందింపజేయడంలో గోదావరిఖనిలో తాను చేసిన నిరాహారదీక్ష నిదర్శనమని తెలిపారు. కార్మిక సమస్యలపైనే కాకుండా స్థానిక సమస్యల పట్ల సైతం ఎంతో నిబద్ధతతో నిజాయితీగా పనిచేస్తున్న సీఐటీయూ గెలుపు తథ్యమని కార్మికులందరూ చర్చించుకుంటున్నారని, ఈసారి కార్మికుల మనసులో ఉన్న ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేసి గెలిపించడానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ పోరాటాలలో తాము సైతం భాగస్వామ్యం అవుతామంటూ పలువురు కార్మికులు స్వచ్ఛందంగా యూనియన్ లోకి చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఉపాధ్యక్షులు కస్తూరి చంద్రశేఖర్, శైల శ్రీనివాస్, శ్రీధర్, నరేష్, ప్రవీణ్, ఆవునూరు మహేష్, పెరిక సదానందం, సమ్మయ్య, బోడకుంట శంకర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడే సీఐటీయూని గెలిపించండి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

అనుక్షణం కార్మిక సమస్యలపై పోరాడుతూ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గెలిపించాలని మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, ఉపాధ్యక్షులు రామస్వామి కార్మికులను కోరారు. శుక్రవారం ఆర్కేసీహెచ్‌పీ గనిలో ఆ గని పిట్ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌లో ఎస్.వెంకటస్వామి, రామస్వామి మాట్లాడుతూ గుర్తింపు ఎన్నికలను యాజమాన్యం నిర్వహించేది కార్మిక సమస్యలపై మాట్లాడాలని తప్ప ఆస్తులు సంపాదించుకోవడానికి కాదని పేర్కొన్నారు. గతంలో ప్రొడక్షన్ పీరియడ్‌లో పే డేలు పెంచి ఇన్సెంటివ్ సైతం ఇచ్చేవారని నేడు పే డేలు తగ్గిస్తూ స్పెషల్ ఇన్సెంటివ్ సైతం ఇవ్వకుంటే ప్రశ్నించలేని సంఘాలతో లాభమేమిటిని విమర్శించారు. సీఐటీయూగా పలు సమస్యల పరిష్కారానికి అవగాహన కల్పిస్తూ యాజమాన్యం ప్రశ్నిస్తూ పోతున్నామని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాల వలన పూర్తిగా భవిష్యత్తు లేకుండా పోతున్నదని మండిపడ్డారు. కార్మికులు అందరూ కష్టపడి బొగ్గు రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వల్లకొండ ఐలయ్య, ఆవాల సంజీవ్, బంగారు శ్రీనివాస్, లింగాల రమేష్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ సెంట్రల్ సెక్రటరీకి ఘన సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిపై శుక్రవారం మండల కేంద్రానికి చెందిన రాపర్తి శ్రీనివాస్ ఐఎన్టీయూసీ సెంట్రల్ సెక్రెటరీగా నియమితులైన సంధర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు, కార్మికులు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సంధర్భంగా రాపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఉండి సమస్యలపై పోరాడి, పరిష్కారానికి కృషి చేస్తానని, గనులపై పర్యటించి. సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, నాయకులు సిద్ధం తిరుపతి, నస్పూరి నర్సింగ్, కోడూరి మునేందర్, ఐఎన్టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గిన్నలేటి గ్రామంలో వృద్ధులకు ఎస్సై మధూకర్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఇన్ఫంట్ జీసెస్ క్యాథలిక్ చర్చి ఫాదర్ సోమ్ థోమస్ అందజేసిన 50 దుప్పట్లను వృద్ధులకు అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు మానవతా దృక్పథాన్ని అలవరుచుకొని ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి సహాయ సహకారాలు అందించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన అన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన శివకుమార్‌గౌడ్ శుక్రవారం రోడ్డుపై రూ.15వేల విలువగల సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. కాగా శాంతినగర్‌కు చెందిన వంగరామకృష్ణ ఆటో డ్రైవర్‌కు ఈ ఫోను రోడ్డుపై దొరకడంతో దీన్ని తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి పోలీసులకు అప్పగించాడు. కాగా పోలీసులు ఈ ఫోన్ శివకుమార్‌గౌడ్‌దని నిర్ధారణ చేశారు. అనంతరం శివకుమార్ గౌడ్‌కు పోలీసుల సమక్షంలో ఆటో డ్రైవర్ రామకృష్ణ అందజేయడంతో పోలీసులు యువకుడిని అభినందించారు. ఆటో డ్రైవర్‌ను హెడ్ కానిస్టేబుల్ తస్నీరు ప్రకాష్ అభినందించారు. ప్రతి ఒక్కరూ నిజాయితీతో ఉండాలని అన్నారు.

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-కడెం



మండలంలోని మైసంపేట్ గ్రామానికి చెందిన అడ మహేందర్ ఇటీవల ఎలుగుబంటి దాడిలో తీవ్ర గాయాలపాలై హైదరాబాద్ పట్టణంలోని మెహిందీపట్నంలోని సరోజిని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నా విషయం తెలుసుకొని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆస్పత్రికి చేరుకొని ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అడ మహేందర్‌కు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రానికి చెందిన నాగుల లక్ష్మీ నరసింహ(45) మత్స్యకారుడు రోజువారీగా కడెం ప్రాజెక్టులోకి చేపల వేటకు వెళ్లగా శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో కడెం ప్రాజెక్టులో వలవేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుకు వల చుట్టుకొని తేప్పపై నుంచి నీటిలో పడి లక్ష్మీ నరసింహ నీట మునిగి మృతి చెందాడు. గమనించిన మరికొందరు మత్స్యకారులు ఘటన స్థలానికి చేరుకొని చూసేసరికి అప్పటికే మృతి చెందినట్లు గమనించి, ప్రాజెక్టు ఒడ్డుకు మృతదేహాన్ని తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి భార్య ఇటీవల అనారోగ్యంతో చనిపోగా మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

ఎడ్‌బిడ్ తండా పాఠశాలలో చోరి

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎడ్‌బిడ్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సురేష్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి తాళం పగలగొట్టి రూమ్‌లో ఉన్న రూ.30వేల విలువగల సాంసంగ్ ట్యాబ్, అలాగే స్పీకర్, రూ.3వేల విలువగల ఆట వస్తువులు, పాఠశాలకు సంబంధించిన ముఖ్యమైన రిజిస్టర్లు చోరికి గురయ్యాయని పేర్కొన్నారు. ఈ విషయమై ముథోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రైతులకు అందుబాటులో శనిగ విత్తనాలు

నవతెలంగాణ-ముథోల్

బిద్రేల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ముథోల్, బాసర గోదాముల్లో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మెన్ తీగల వెంకటేష్‌గౌడ్ తెలిపారు. ముథోల్, బాసర, ఆష్ట, గ్రామాలలో ఎరువులు అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆష్టలో సన్నం యూరియ, కారేగాంలో దొడ్డు యూరియా అందుబాటులో ఉందన్నారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకొని పీఏసీఎస్‌లో సంప్రదించాలని కోరారు. డీఏపీ రూ.1350, గ్రోమోర్ 20:20:0:13 రూ.1140, పోటాష్ రూ.1700, యూరియా రూ.267, శనిగ విత్తనాలు(జేజి 1125 రకం) రూ.1825, ఉన్నట్లు తెలిపారు.

ఎండీఎం కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.10వేల వేతనం వెంటనే అమలు చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల కృష్ణమాచారి కోరారు. తిర్యాని మండలంలోని సార్వాయి పాపన్న మందిరం వద్ద సీఐటీయూ మండల కన్వీనర్ గుండం శంకర్ అధ్యక్షతన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.10 వేల వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. కార్మికులు గత ప్రభుత్వంలో ప్రశ్నించే పరిస్థితి లేకుండా ఉండేదని ఆరోపించారు. అల్పాహార పథకంలో కార్మికులపై అదనపు భారం మోపిందన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా రాజకీయ ఒత్తిడితో కార్మికులను తొలగింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు మడావి చంద్రకళ, సహాయక కార్యదర్శి వెడ్మ ఉర్మిళ, ఉపాధ్యక్షులు గుండం వినోద, కుర్సెంగ లక్ష్మీ, విజయ పాల్గొన్నారు.

మా బడి మాకు కావాలి



బడికి వెళ్లకుండా స్వగ్రామం చించాల పాఠశాలలోనే అడుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-ముథోల్

విద్యార్థులు లేరని నెపంతో ఉన్నత పాఠశాలను ఎత్తివేయటానికి సంబంధిత అధికారులు ప్రయత్నం చేయటంతో పేద విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. విద్యాశాఖ ఉన్నతాధికారి అనాలోచిత నిర్ణయం విద్యార్థులకు శాపంగా మారిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉన్నారనే నెపంతో 6, 7, 8, తరగతుల విద్యార్థులను సైతం ఎడ్‌బిడ్ పాఠశాలకు పంపడం అన్యాయమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ పాఠశాలలో అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ కేవలం 9, 10 తరగతులలో విద్యార్థులు తక్కువ ఉన్నారన్న నెపంతో ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్ కింద కావాలనే ఇతర పాఠశాలలకు పంపి మా పాఠశాలలో చదివే బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9, 10 తరగతి విద్యార్థులు తక్కువగా ఉంటే వారిని ఇతర పాఠశాలకు పంపించారు. కానీ 6, 7, 8 తరగతి విద్యార్థులు ఉన్నప్పటికీ వీరిని సైతం కావాలని అధికారులు ఎడ్‌బిడ్ పాఠశాలకు పంపి మా పాఠశాల మూసే ప్రయత్నం చేయడం సరికాదని పేర్కొంటున్నారు. ఇటీవలనే పీజీ హెచ్‌ఎం పోస్ట్ వచ్చినప్పటికీ బడిని తెరవక పోవటం సరికాదని అంటున్నారు. పిల్లలు అటు సక్రమంగా బడికి వెళ్లక, ఊర్లో కానీ చించాల పాఠశాల ముందు ఆడుకుంటున్నారు తప్ప ఎడ్‌బిడ్ పాఠశాలకు వెళ్లడం లేదు. చించాలలోనే చదువుకుంటామని విద్యార్థులు అంటున్నారు. విద్యార్థులకు సాంకేతిక పరికరాలతో చదువు చెప్పేందుకు సుమారు రూ.6లక్షల విలువ గల సాంకేతిక బోధన పరికరాలు సైతం ఇటీవల ఈ పాఠశాలకు వచ్చాయి. 6, 7, 8 తరగతుల విద్యార్థులు సుమారు 30మంది ఉన్నప్పటికి బడి నడుపక పోవడం అన్యాయం అంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు రెండు సార్లు వినతిపత్రం అందజేశారు. ఒక సారి రాస్తారోకో చేసిన స్పందించక పోవడం పేద విద్యార్థులకు అన్యాయం చేయడమేనని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మా పాఠశాల మాకు ఉండాలని వెంటనే బడి తెరవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళలకు జీరో టికెట్ ప్రక్రియ షురూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహిళకు జీరో టికెట్టు అందజేస్తున్న కండక్టర్

మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ జారీ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 9 నుంచి ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నా, ఎలాంటి టికెట్ జారీ కాలేదు. ఆర్టీసీ నష్టపోయే ఆధాయాన్ని ప్రభుత్వ రీయింబర్స్ చేయడం ద్వారా సమాకుర్చనుంది. ఎంత మంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారో వివరాలను ప్రభుత్వానికి తెలియజేడానికి జీరో టికెట్ జారీ ప్రక్రియను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తీసుకువచ్చారు. టికెట్ జీరో అని చూపించిన ఆ మహిళా ఎక్కడి నుంచి ఎక్కడ ప్రయాణించిందో అందులో చూపిస్తుంది. తెలంగాణలో నివసించే ప్రతి మహిళలకు ఈ మహాలక్ష్మీ పథకం వర్తిస్తుందని అన్నారు. జీరో టికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైనందున మహిళలు వారి గుర్తింపు కార్డులు చూపించి సరిహద్దు వరకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని డీఎం కల్పన తెలిపారు. దీని కోసం ఎండీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. శుక్రవారం నుంచి జీరో టికెట్ జారీ ప్రారంభమైందన్నారు. ఈ టికెట్‌లో మహిళాలు ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించారో తెలుస్తుందన్నారు. కాగా శుక్రవారం ఆదిలాబాద్ బస్టాండ్‌లో ఐడీ కార్డులు చూపించిన వారికి బస్ కండక్టర్ జీరో టికెట్ ఇచ్చారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, విద్యాశాఖాధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందిస్తూ, తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల ద్వారా మెరుగైన విద్య అందించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధా రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ పిల్లల్లో విద్యాసామర్థ్యాలను పెంచడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి నుండి 5వ తరగతి వారికి తొలిమెట్టు, 6 నుండి 9వ తరగతి వారికి ఉన్నతి, పదవ తరగతి వారికి లక్ష్య అనే ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అన్ని పాఠశాలలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా పిల్లలు ప్రతి సబ్జెక్టులో ప్రతిభ కనబరుస్తారన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఈనెల 12 నుండి జనవరి 12 వరకు 'అకాడమిక్ బబుల్ ' అనే ప్రత్యేక కార్యక్రమంను రూపొందించామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో ధారాళంగా చదవడం, రాయడం, విషయాలవారి పూర్వ భావనల జ్ఞాన అభ్యసన ఫలితాలను సాధించవచ్చన్నారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా స్కూల్ వివరాలను తెలుసుకొని కలెక్టర్లు, డీఈఓలు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు తొలిమెట్టు, లక్ష్య, ఉన్నతి కార్యక్రమాల ద్వారా పిల్లలకు అత్యుత్తమమైన విద్యాబోధనలు అందించడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, జిల్లా విద్యాశాఖ అధికారిణి టి. ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.

బీసీ సంఘానికి స్థలం కేటాయించి, భవనం ఏర్పాటు చేయాలి

- సంఘం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు రూప్నర్ రమేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో బీసీ సంఘం భవనం కోసం స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నర్ రమేష్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రగతి భవన్‌కు వెళ్లి బీసీ సంక్షేమ సంఘం రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్‌తో కలిసి సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అత్యంత వెనుకబడిన జిల్లాలలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మొట్టమొదటి స్థానంలో ఉందని అన్నారు. బీసీతో పాటు ఇతర కులస్తులు సమావేశాలకు స్థలం లేక చెట్ల కింద, బ్రిడ్జిల కింద సమావేశాలు ఏర్పాటు చేసుకొని సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నారన్నారు. వెనుకబడిన జిల్లా కావడంతో నిధులు లేకపోవడంతో భవనాన్ని ఏర్పాటు చేయలేకపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ భవనానికి స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



అధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని సోనారి, పకీర్ నాయక్ తండా గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారులు అశ్విని, నారాయణ ఉన్న రైతులకు అధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోనారి గ్రామంలో రిలియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఆర్డీ వారిచే రైతులకు ఉచితంగా ముగ్గురి రైతులకు సొయా బెడ్ సిస్టమ్స్ ఆ శాఖ అధికారి కృష్ణ ప్రసాద్ వ్యవసాయ విస్తరణాధికారి నారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదే విధంగా పకీర్ నాయక్ తండాలో పంట నమోదు పత్రాలను ఏఇఓ అశ్విని సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులకు ఎలాంటి అవసరాలు ఉన్న తమ వద్దకు వచ్చి సమస్యను పరిశీలించి, పంటలకు అవసరమైన సూచనలు సలహాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు దత్తురాం పటేల్, మహేందర్‌గౌడ్ గంగాధర్ పటేల్, గ్రామస్తులు, రిలియన్స్ నిర్వాహకులు ఉన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం



నవతెలంగాణ-కడెం

మండలంలోని ధర్మాజీపేట్ శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ 17వ వార్షికోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా సాగింది. అర్చకులు పీసుపాటి చంద్రశేఖర్, కుచనపెళ్లి చిన్న నర్సయ్యలు వేదమంత్రోచ్ఛరణల మధ్య హనుమాన్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, పుణ్య వచనం, కుంకుమ పూజలు ప్రత్యేక హోమాలు తదితర కార్యక్రమాలతో పాటు తీర్థ ప్రసాదాల వితరణ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం తగదు



నవతెలంగాణ-కడెం

గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, సంపద వనాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం తగదని డీఆర్డీఓ విజయలక్ష్మీ అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని కడెం, పెద్దూర్, కన్నాపూర్, నవాబ్‌పేట్, పాండ్వాపూర్ గ్రామాల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, సంపద వనాలను, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఓ విజయలక్ష్మి పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈజీఎస్ అధికారులు సిబ్బందితో క్లస్టర్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలందరికీ ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఏపీఓ జయదేవ్, క్లస్టర్ ఈజీఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



నవతెలంగాణ-ముథోల్

బడి ఈడు పిల్లలను బడిలోనే ఉండాలని ఎంఈఓ మైసాజి అన్నారు. శుక్రవారం మండలంలోని చించాల గ్రామంలో బడి బయట ఉన్న విద్యార్థుల కోసం సర్వే నిర్వహించారు. బడికి రాని పిల్లల ఇంటికి వెళ్లి పోషకులు కలిశారు. అలాగే గ్రామ పంచాయితీ పరిధిలోని ఇటుక బట్టీల వద్దకు వెళ్లి, అక్కడున్న బడి ఈడు పిల్లలు వివరాలు సేకరించి బడిలో చేర్పించారు. పోషకులు తమ పిల్లలను విధిగా బడిలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరసింహచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, కాంప్లెక్స్ సీఆర్పీ భూమన్న పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర ఇన్‌ఛార్జి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ ఎమ్మెల్యేలను ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అభినందించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యేల సన్మానంలో రాజసింగ్‌తో పాటు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్‌లను తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఇంచార్జ్ తరుణ్ చుగ్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిలు శాలువతో సన్మానించి, అభినందించారు. పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గాల్లో మరింత కష్టపడాలని సూచించారు.

ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్



ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గంలో నూతనంగా గెలుపొందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మీ, వెడ్మ బోజ్జులను నాగల్‌కొండ ఎంపీటీసీ బాధావత్ కళావతి ఉత్తం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉట్నూర్‌లో కలిసిన ఆయన వారికి శాలువాతో సన్మానించారు. ముందుగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించి ఏజెన్సీ గ్రామాల్లో నెలకొన్ని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

సమస్యల వలయంలో ఆ పల్లె..!

- అభివృద్ధికి దూరంగా గొల్లఘాట్ గ్రామం
- అత్యవసర సమయంలో తప్పని అవస్థలు
- ఎన్నికలను బహిష్కరించిన గ్రామస్తులు
- అయినా స్పందించని అధికార యంత్రాంగం

ప్రపంచమంతా సాంకేతికత వైపు అడుగులు వేస్తోంది. పల్లెలన్ని అభివృద్ధి ముల్లెలుగా మారుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాలను చూసి ముచ్చటపడిన ఆ ఊరి జనం..వారి గ్రామంలో సౌకర్యాలు లేక అసంతృప్తికి గురవుతున్నారు. వారి సొంత గ్రామం ఎప్పుడు అభివృద్ధి చెందుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామస్తులు. ఎన్నికలు బహిష్కరిస్తేనైనా అధికారుల మనసు కరుగుతుందని భావించినా ఎలాంటి ప్రయోజనం కలగడం లేదు. కనీసం రోడ్డు సౌకర్యం లేని కారణంగా బహ్యా ప్రపంచానికి దూరం కావాల్సి వస్తోందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నాయకులు గ్రామానికి వచ్చి పలు హామీలు ఇచ్చినప్పటికీ.. వాటిని నెరవేర్చడంలో మాత్రం విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు.

నవతెలంగాణ-తాంసి

అభివృద్ధికి ఆమడ దూరంలో నిలుస్తోంది ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామం. ఇక్కడ 500మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో 270మంది ఓటర్లు ఉన్నారు. ఏండ్ల క్రితమే ఈ గ్రామంలో కనీసం సౌకర్యాలు కూడా కనిపించడం లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసినా తాగునీరు సరఫరా కావడం లేదు. అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రతి సారి ఎన్నికలు రాగానే గ్రామస్తులు తమ గ్రామ అభివద్ధితో పాటు రోడ్డు సౌకర్యం కల్పించాలని విన్నవించుకోవడం.. గెలిచిన తర్వాత మీ గ్రామానికి అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు రోడ్డు వేయిస్తామని నాయకులు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారుతోంది. పోలింగ్ ముగిశాక గెలిచిన నాయకులు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితులు గత ఎన్నో ఏళ్ల నుండి జరుగుతున్నాయి. పాలకులు, నాయకుల మాటలకు విసుగుచెందిన గ్రామస్తులు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించారు.

మధ్యలోనే చదువులు..!

గ్రామానికి రవాణా సౌకర్యం లేని కారణంగా విద్యార్థులు చదువులను మధ్యలోనే నిలిపివేసి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అస్పత్రికి వెళ్లలేక ప్రాణాలు నిలుపుకోవడం కష్టతరంగా మారుతోంది. పోలింగ్ రోజున గ్రామస్తులకు నచ్చచెప్పేందుకు వచ్చిన అధికారులు ఆ తర్వాత ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. ఎన్నికలను బహిష్కరించినా పాలకుల్లో చలనం లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. మండలంలోని గొర్లకుంట క్రాస్ రోడ్ వరకు బీటీ రోడ్డు ఉంది. అక్కడినుండి దాదాపు 6 కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు గుంతల మయంతో కూడిన రోడ్డు ఉంది. గుంతలు, రాళ్ళు రప్పలు ఉండడంతో రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా ఉంటుందని అనారోగ్యం బారిన పడిన రోగులను మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తీసుకెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ అంబులెన్స్ వాహనం రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపి ఉంచుతారు. అక్కడి వరకు ఎడ్లబండ్లలో తీసుకువెళ్లడం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో సమయానికి చికిత్స అందక మరణించిన దాఖలాలు ఉన్నాయి. అంతర్గత రోడ్లు, విద్యుత్, మంచినీటి సరఫరా, డ్రైనేజీలు వంటి అనేక సమస్యలు ఉన్నాయని చెబుతున్నారు. గ్రామంలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది అంటున్నారు ఆ గ్రామస్తులు. ఇకనైనా మా గ్రామ దుస్థితి జిల్లా కలెక్టర్ పట్టించుకోవాలని కోరుతున్నారు.



తాంసిలోని గోల్లఘాట్ గ్రామం ఇదే



గొల్లఘాట్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి

ఏండ్లు గడుస్తున్నా దుస్థితి మారడం లేదు

-గేడం నందు, గొల్లఘాట్ గ్రామస్తుడు



దాదాపు నేను పుట్టిన నాటి నుంచి మా గ్రామ దుస్థితి ఏమి మారలేదు. ఎన్నో మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతున్నా. మా గ్రామం మాత్రం అలాగే ఉంది. అధికారులు, నాయకులు మా గ్రామాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు..? కనీస సౌకర్యాలు లేకపోవడం నీటి సౌకర్యం, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు కూడా లేని పరిస్థితి ఉంది. రవాణా మార్గం లేకపోవడంతో పిల్లలు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. అత్యవసరంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి మా గ్రామాన్ని అభివృద్ధి చేయాలి.

రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరిన జిల్లా హాకీ జట్టు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కామారెడ్డిలో జరిగే అండర్-14 బాలబాలిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదిలాబాద్ జిల్లా జట్టు బయల్దేరింది. శుక్రవారం బస్టాండ్‌లో కోచ్ గోవింద్ నేతృత్వంలో క్రీడాకారులు తరలివెళ్లారు. ఈనెల 16 నుంచి 17 వరకు రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని కోచ్ గోవింద్ తెలిపారు. రెండు సంవత్సరాలుగా క్రీడాకారులు శ్రమిస్తున్నారని రాష్ట్ర స్థాయిలో కప్ సాధించడమే లక్ష్యంగా పోటీల్లో వీరి ప్రదర్శన ఉంటుందని ఆశభావం వ్యక్తం చేశారు.

బ్యాంకు ఖాతాదారులు బీమా చేసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

జిల్లా సహకార బ్యాంకుల్లో బ్యాంకు ఖాతా రుణాలు పొందిన ప్రతి ఒక్క లబ్ధిదారుడు జీవిత, సురక్ష బీమా చేయించుకోవాలని నాబార్డ్ ఫైనాన్షియల్ అధికారి అశోక్ రెడ్డి సూచించారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలోని సహకార సంఘం బ్యాంక్ కార్యాలయంలో రైతులు, బ్యాంక్ ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి జీవిత బీమాపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు, బ్యాంక్ ఖాతాదారులు జీవిత బీమా చేయించుకోవాలి సూచించారు. ప్రధాన మంత్రి జీవిత, సురక్ష బీమా వంటి అనేక బీమా సౌకర్యాలు ఉన్నాయన్నారు. సంవత్సరానికి రూ. 436 చెల్లించి రూ. 2లక్షల వరకు బీమా సౌకర్యం పొందవచ్చని తెలిపారు. రైతులకు వ్యవసాయ సహకార సంఘం బ్యాంకుల్లో అన్ని రకాల రుణాలు ఇవ్వడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకొని రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఏటీఎం సౌకర్యం కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రౌఫ్, డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11కేవీ ఉపకేంద్రం జీఎస్‌నగర్‌లో మరమత్తులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీని కారణంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మండలంలోని రాంపూర్, పొచ్చర, దిమ్మ, జందాపూర్, భీంసరి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-తాంసి

లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా శుక్రవారం తహసీల్దార్ లక్ష్మి సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. జనవరిలో పంచాయతీ ఎన్నికల అనంతరం పార్లమెంట్ ఎన్నికలుంటాయన్న సంకేతలకు అనుగుణంగా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లలో అన్ని వసతులు కల్పించాలని సిబ్బందికి తహసీల్దార్ సూచించారు. ఆమెతో పాటు ఆర్ఐ మహేందర్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సర్వేయర్ మనోజ్, రికార్డ్ అసిస్టెంట్ అడెల్లు, హెచ్‌ఎం శ్రీకాంత్ ఉన్నారు.

జనవరి 1 నుంచి ఇంటింటికి అయోధ్య అక్షింతలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అయోధ్యలో భవ్య రామ మందిర పునఃప్రతిష్టపణ జనవరి 22న నిర్వహించడం జరుగుతుందని, రాములోరి కార్యంలో ప్రతి హిందూ భాగస్వాములు కావాలని విశ్వహిందూ పరిషత్ ఇందూర్ విభాగ్ కార్యదర్శి తమ్మల క్రిష్ణ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాములోకి కార్యంలో ప్రతి హిందువు పాల్గొనడం అసాధ్యమని భావించి రాముని అక్షింతలను ప్రతి హిందువు ఇంటికి చేర్చేలా జనవరి 1 నుంచి జన సంపర్క్ అభియాన్ పేరుతో 15 రోజుల పాటు అక్షింతలను తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

గంజాయి అమ్ముతున్న నలుగురు అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గంజాయి అమ్ముతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో గంజాయి అమ్ముతుండగా వడ్డెర కాలనీకి చెందిన షేక్ బిలాల్, డాల్డా కంపెనీకి చెందిన షేక్ షోహెబ్, రిక్షాకాలనీకి చెందిన సయ్యబ్ ముషారబ్, కాంబ్లే ముఖేష్‌లు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ.4 వేల విలువ గల 400 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఒక చరవాణి స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. పట్టణంలో అసాంఘగిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీల్లో ఎవరైన గంజాయి విక్రయిస్తు తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

నవతెలంగాణ-తాంసి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని డీఆర్డీఓ కిషన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ ఉపాది 2022, మార్చ్ 2023 సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ వేదిక కార్యక్రమాన్ని ఎంపీపీ సురుకుంటి మంజుల అధ్యక్షతన నిర్వహించారు. మొదటగా 13 గ్రామపంచాయతీలో పది రోజులుగా గ్రామాల వారిగా పనులకు సంబంధించిన సిబ్బంది తనిఖీ చేసిన నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాలను అక్కడక్కడ ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు పనులు చేయాని వారికి కూలీల చెల్లింపులు చేసిన వారికి డబ్బులు వారి ఖాతాల్లో జమ కానట్లు తెలిపారు. క్రీడ ప్రాంగణాల్లో హరితహారంలో నాటిన మొక్కలు దాదాపు 60 శాతం నీటి సౌకర్యం లేకపోవడంతో ఎండిపోయినట్లు నివేదికల్లో తెలింది. ఈ సందర్భంగా డీఆర్డీఓ కిషన్ మాట్లాడుతూ 2022 మార్చ్ 2023 సంవత్సరంలో 13 గ్రామపంచాయతీలో 98 రకాల పనులను నిర్వహించారన్నారు. రూ. కోటి 48 లక్షల 485 నిధులతో పనులు జరిగాయన్నారు. రూ.16 లక్షల 84 వేల 177 వివిధ రకాల మెటీరియల్‌లకు నిధులు మంజూరు చేశామన్నారు. మొత్తం రూ. కోటి 74 లక్షల 71, వేల150 జాతీయ ఉపాధి హామీ నిధులు విడుదల అయినట్లు పేర్కొన్నారు. కూలీలకు వెళ్లే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు చేసే బాధ్యత ఉపాధి సిబ్బందిదేనని ఆయన అన్నారు. ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరగకూడదు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భూమయ్య, ఏపీడీ కిషన్ రావు, డీఆర్‌డీపీ ఏఓ గంగాధర్, ప్లాంటేషన్ మేనేజర్ సూర్య ప్రకాష్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ పాండురంగ, సర్పంచులు, ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



ఉపాధి హామీ పనుల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీఓ కిషన్

19న కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అంజనేయ యూత్ ఆధ్వర్యంలో 19 నుంచి ఖండాల గ్రామంలో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వహక కమిటి సభ్యులు పెందూర్ లాల్‌షావ్, నైతం కృష్ణ తెలిపారు. శుక్రవారం ఖండాలలో టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అథితులుగా ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీటీసీ కుమ్ర జంగు, సర్పంచ్ మడావి అశోక్, ఉప సర్పంచ్ మర్సుకోల మాణిక్‌రావు, పటేల్ మర్సుకోల దేవిదాస్ పటేల్, లచ్చు దేవారిలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ. 701 ఉందన్నారు. మొదటి బహుమతి రూ. 18001, రెండవ బహుమతి రూ.12001 అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9347707408, 6305176514లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంకోష్, జాను, దిగంబర్, ప్రభాకర్, దినేష్, సంతోష్, యశ్వంత్ పాల్గొన్నారు.

మీసేవ ఆధార్ కేంద్రాలను తనిఖీ చేసిన ఈడీఎం



ఆధార్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఈడీఎం రవి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావల తహసీల్దార్ కార్యాలయంలోని ఆధార్ సెంటర్‌ను కలెక్టరేట్ ఈడీఎం రవి గురువారం సందర్శించారు. ఆధార్ సర్వీసెస్‌ను ఆధార్ సెంటర్స్‌లో కాకుండా ప్రత్యామ్నాయంగా మైఆధార్.యూఐడీఏఐ.జీఓవీ.ఇన్ ద్వారా కూడా మొబైల్ నెంబర్, అడ్రస్, రాష్ట్రం పేరు వంటి వివరాలు అప్‌డెట్స్ చేసుకోవచ్చని సూచించారు. మొబైల్ లాగిన్ ద్వారా కూడా సంబంధిత సేవలను పొందడానికి గూగుల్ ప్లే స్టోర్ లేదా అప్ స్టోర్ నుండి యమ-ఆధార్ యాప్ వెర్షన్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని కూడా ఆధార్ అప్డేట్ చేయవచ్చని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రుసుము వసులు తీసుకుంటే రూ.50 వేల జరిమానా విధిస్తామన్నారు. సిటిజన్స్ 1947కి గాని మీసేవ సెక్షన్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లాలో కొన్ని మండలాల్లో సస్పెండ్‌కు గురైయానా ఆధార్ సెంటర్ స్టేటస్ రాష్ట్ర ఈఎస్‌డి కమీషనర్ ఆఫీస్‌లో పరిశీలనలో ఉందని తెలియజేశారు.

గిరిజన సంక్షేమ సీఆర్టీల వేతనాలు విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల వేతనాలు చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అశోక్ డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి వారు మాట్లాడారు. ఏడు నెలలుగా సీఆర్టీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న సీఆర్టీలకు గత ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడ్డాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం గిరిజన సంక్షేమ సీఆర్టీల ఇబ్బందులను గుర్తించి వెంటనే వారి వేతన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్ రావ్, జిల్లా కార్యదర్శి కె గణేష్, ఇంద్రవెల్లి మండల బాధ్యులు ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

పూర్వ ప్రిన్సిపాల్ మృతికి సంతాపం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాగపూర్‌లో మరణించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆదిలాబాద్ పూర్వ ప్రిన్సిపాల్, ఆదిలాబాద్ వాసి కిష్టయ్య మృతికి సైన్స్ డిగ్రీ కళాశాలలో సంతాపం ప్రకటించారు. శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్ మాట్లాడుతూ కిష్టయ్య నీతి, నిజాయితీ, నిబద్ధతకు మారుపేరని కొనియాడారు. ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రఘునాథ్, సంతోష్ కుమార్, విజయ్ కుమార్, నర్సింగరావు, దయాకర్, సాయి ప్రసాద్, అనిత, జ్యోత్స్న, అష్రఫ్ అలీ, రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వాఘాపూర్‌ను సందర్శించిన ఏంకాస్ బృందం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలంలో శుక్రవారం ఢిల్లీ బృందం క్వాలిటీ ఎస్సెస్మెంట్‌లో భాగంగ అంకోలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వాఘాపూర్ సబ్ సెంటర్‌ను డా. ప్రదీప్ కుమార్ చౌదరి సందర్శించారు. సెంట్రల్ బృందం సభ్యులు రికార్డులు, చార్ట్స్, రిజిస్టార్లు, గార్డెన్, సబ్‌సెంటర్‌లో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డా. సుబ్ర జ్యోతిరావు, డిప్యూటీ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సాధన, అంకొలి వైద్యులు డా.సర్వరాజ్, మేనేజర్ అమర్‌నాథ్, డా. శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సురేష్, బొమ్మెత సుభాష్, ఎల్‌టీ శ్రీనివాస్, పార్మాసిస్ట్ రాందాస్, స్టాఫ్‌నర్స్ అశ్విని, ఎంఎల్‌హెచ్‌పీ రోజా, రమణి, కృష్ణవేణి, ఆరోగ్య కార్యకర్తలు సంగీత, లలిత, ఆశాకార్యకర్తలు గౌరుబాయి, శాంత, కమల, అనిత, ప్రమీల, రాధ, భాగ్యలక్ష్మీ, నాగుబాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కైలాస్‌నగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు, అటెండర్ కాలనీ, శాంతినగర్, కుమ్మరివాడ, వాల్మీకీ నగర్, ఇండస్ట్రీయల్ ఏరియాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మాణం

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల మున్సిపల్ చైర్మెన్ పెంట రాజయ్య, వైస్ చైర్మెన్ ముఖేష్ గౌడ్‌పై 27 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు శుక్రవారం అవిశ్వాసం తీర్మాణం చేసి కలెక్టర్ బధావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా మంచిర్యాల మున్సిపాలిటీ అభివృద్ధి జరగ లేదని, అభివృద్ధి కోసమే అవిశ్వాస తీర్మాణం పెట్టామన్నారు. గత పాలకులు అభివృద్ధిని పక్కనపెట్టి దోచుకోవడమే ధ్యేయంగా పనిచేశారని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో అవిశ్వాస తీర్మాణాల పర్వం కొనసాగుతుందని, బెల్లంపల్లిలో అవిశ్వాస తీర్మాణం పెడుతున్నారన్న విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ చైర్మెన్ కాంగ్రెస్‌లో చేరడం విధితమే. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఆధ్వర్యంలో ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని, ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో 17 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం దివాకర్ రావుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారని సామాజిక మాధ్యమాల్లో పలువురు అంటున్నారు.

కోల్ ఇండియా ఒప్పందాల అమలుకు కృషి

నవతెలంగాణ-నస్పూర్

కోల్ ఇండియా ఒప్పందాలను సింగరేణిలో అమలు చేసేందుకు కృషి చేస్తానని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య భరోసా ఇచ్చారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన ఎస్ఆర్పీ-1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో భాగంగా కార్మికుల పక్షాన పని చేసే బీఎంఎస్ కాగడ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ప్రమోషన్ పాలసీలు, అలవెన్సులపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంట్ కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇస్తున్నామన్నారు. కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన విద్య, కార్పొరేట్ వైద్యం అందించడం, కోల్ ఇండియా బొగ్గు గని కార్మికులకు మార్గదర్శిని డిక్షనరీ ప్రతి ఒప్పందం కూడా అమలుకు కృషి చేస్తామన్నారు. వేజ్ బోర్డ్ ఒప్పందం ప్రకారం ప్రకారం సింగరేణిలో ప్రతి కార్మిక కుటుంబానికి స్వచ్ఛమైన రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ ద్వారా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, అడిగోప్పుల రాజకుమార్, పురుషోత్తమ చారి, వసంతరావు, మేకల స్వామి, పాగిడి శ్రీకాంత్, రాజేందర్, రాజేందర్, తిరుపతి, చల్ల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలోని ప్రజా ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు అత్యంత కీలక పాత్ర పోషించారని అన్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉద్యమాన్ని అనచివేసేసేందుకు అక్రమ కేసులు పెట్టిందని తెలిపారు. దీని వలన విద్యార్థులు, యువతులు, యువకులు ఉద్యమకారులు ఆర్థికంగా అనేక విధాలుగా నష్టపోయారని అన్నారు. దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ కారులను గుర్తించలేదని అన్నారు. అక్రమ కేసుల వలన ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని, ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు కొండ్ర రాజేశ్వర్, రూప్నర్ రమేష్, రేగుంట కేశవ్, మారుతి పటేల్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో డిసెంబర్ 27న జరిగే గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించాలని డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవీ రావు అన్నారు. గుర్తింపు సంఘ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం ఎస్ఆర్పీ ఉపరితల గని, ఎస్ఆర్పీ 3గనులలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదాలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అలాంటి మోస పూరితమైన మాటలు నమ్మకుండా నిరంతరం కార్మికుల కోసం ఏ పోరాటానికైనా ముందుండే ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఆర్పీఓసీ, ఎస్ఆర్పీ 3 గనుల నుంచి దాదాపు 300 కార్మికులు, వివిధ కార్మిక సంఘ నాయకులు ఏఐటీయూసీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, ఫిట్ కార్యదర్శిలు మురళి చౌదరి, మోహన్‌రెడ్డి, అఫ్రోజ్ ఖాన్, గండి సతీష్, గొల్లపల్లి రామచందర్, తౌటం మల్లేష్, అంబాల రవి, సత్తయ్య పాల్గొన్నారు.

ట్రినిటి హైస్కూల్‌లో సైన్స్ ఫెర్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ట్రినిటి హై స్కూల్‌లో సైన్స్ ఫెర్ నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ట్రినిటి హై స్కూల్‌లో సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని ఎస్సై లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచనా ధోరణి, సామర్థ్యం పెరిగి వారిలో సృజనాత్మక శక్తి సైన్స్‌ఫెర్ ద్వారా పెరుగుతుందన్నారు. పరిశోధన రంగాల్లో ఉన్నత స్థాయిలో చేరుకోవచ్చాని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ పరిశోధనల వల్ల మానవాళి అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఇలాంటి సైన్స్‌ఫెర్ కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జోసెఫ్, డైరెక్టర్ డోన్ డొమినిక్, వైస్ ప్రిన్సిపల్ రాహుల్, సతీష్ పాల్గొన్నారు.

అక్రమంగా కలప నిల్వ ఉంచితే చర్యలు

నవతెలంగాణ-దండేపల్లి

రేంజ్ పరిదిలో ఎవరైనా అక్రమంగా కల్పన నిల్వ ఉంచితే చర్యలు తప్పవని తాళ్లపేట రేంజ్ అడవీ శాఖ అధికారిణి సుష్మారావు హెచ్చరించారు. శుక్రవారం మంగళం నుండి చింతపల్లిలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంట్లో నిలువ ఉంచిన అక్రమ కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలప రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. దాదాపు రూ.20 వేల అక్రమ కలప పట్టుబడినట్టు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా అక్రమ కలప నిల్వ ఉంచిన, తరలించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా కలప తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

భక్త మార్కండేయ శివాలయంలో అన్నదానం

నవతెలంగాణ-తాండూర్

భక్త మార్కండేయ శివాలయంలోకార్తీక మాసం సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్క రాంచందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన వ్యాపారులు, ఉద్యోగులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్క రామచందర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ శివాలయంలో అన్నదాన కార్యక్రమాలు భజనల వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుడి నిర్మాణానికి సహకరించిన సురభి ఆగమరావు స్థానిక వ్యాపారులు ఆలయ కమిటీ సభ్యులు మండల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోపాల్, ఎంపీటీసీ పెరిక రజిత రాజన్న, గాజుల రమేష్, కోలేటి రమేష్, జంపాల వసంత్, వనమాల కైలాసం, సిద్ధం మల్లేష్, వావిలాల రమేష్, కిషోర్ పాల్గొన్నారు.

నేడు భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు జిల్లాలో ప్రధానమంత్రి భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాహుల్‌తో కలిసి జిల్లా అధికారులతో సంకల్ప్ యాత్ర నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమాభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వంచే అమలు చేయబడుతున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, ధీన్‌దయాళ్, అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, విశ్వకర్మ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, జీవన్ జ్యోతి, భీమా యోజన, సురక్ష భీమా యోజన ఇతరత్రా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో రోజుకు 2 గ్రామపంచాయతీల చొప్పున జనవరి 26వరకు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని దీనిలో భాగంగానే ఆరు గ్యారెంటీలలో రెండింటిని ఇప్పటికే అమలు చేస్తున్నామని మిగతా వాటిని రానున్న 100 రోజుల్లో అమల్లోకి తీసుకువస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ అన్నారు. ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న సర్పంచ్ సిడాం అన్నిగా తో పాటు మరో 60 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించినా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఫలితాలు తమకు వ్యతిరేకంగా వచ్చాయని తెలిపారు. దీనికిగాను కార్యకర్తలు నాయకులు ఆందోళన చెందవద్దన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటమిలు సహజమని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా రైతు రుణమాఫీ రూ. రెండు లక్షలు త్వరలోనే అమలు చేస్తుందని, దీనికిగాను కమిటీలు ఏర్పాటు చేస్తుందని, ఈ నేపథ్యంలో రైతులు బ్యాంకులకు రుణాలు చెల్లించొద్దని సూచించారు. రానున్న స్థానిక, ఎంపీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యకర్తలు ప్రజలకు భరోసా కల్పించేలా ఆరు గ్యారెంటీ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంతో ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారని, దీనిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని మేనిఫెస్టోలో భాగంగా ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు ఇచ్చేలా ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్, నాయకులు సలీం, వాసుదేవ్, శివ, చిట్ల నారాయణ, అసద్, పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ద్వారా ఆర్థికపరమైన సేవలు



నవతెలంగాణ-తాండూర్

మండల ప్రజలకు తాండూర్ యూనియన్ బ్యాంక్ ద్వారా ఆర్థికపరమైన సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు మేనేజర్ అనిల్ దేశ్ ముక్ తెలిపారు. శుక్రవారం ఆర్థిక అవసరాలు పొదుపు ప్రాధాన్యత ప్రభుత్వ బీమా సౌకర్యాల గురించి నవతెలంగాణతో మాట్లాడారు. ఖాతాదారులకు ఆదాయ మార్గాలు పొదుపు ప్రాధాన్యత గురించి తెలియజేస్తూ వారి ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన వ్యాపారుల నిరుద్యోగులకు ఆర్‌బీఐ నిబంధనల మేరకు ముద్ర పథకం ద్వారా రుణ సౌకర్యం అందించి వారి ఎదుగుదలకు దోహదం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభగల రైతులకు పారిశ్రామికవేత్తలకు రుణాలనందించి వ్యవసాయ అభివృద్ధి పారిశ్రామికరణకు తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 1200 మంది రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.25 కోట్ల పంట రుణాలు అందించినట్లు తెలిపారు. గ్రామ ఐక్య సంఘాలకు స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ లావాదేవీలు పొదుపు మార్గాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఖాతాదారులకు ప్రభుత్వ బీమా సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. పీఎం ఎస్బిఐ జేజేబీవైలో ప్రీమియం కట్టి మరణించిన 15 మంది కుటుంబాలకు బీమా క్లైములు అందించినట్లు తెలియజేశారు. సీనియర్ సిటిజన్లకు యూనియన్ బ్యాంకు ప్రత్యేక పొదుపు పథకాలపై అధిక వడ్డీని చెల్లించనున్నట్లు వివరించారు. ఖాతాదారుల అత్యవసర రుణ సౌకర్యాల నిమిత్తం యూనియన్ బ్యాంకులో బంగారు ఆభరణాలపై రుణ సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు. ఖాతాదారుల విలువైన పత్రాలు బంగారు ఆభరణాల రక్షణ నిమిత్తం నామమాత్రం రుసుముతో లాకర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాండూర్ యూనియన్ బ్యాంక్ పరిధిలో 41 వేల మంది ఖాతాదారులు ఉండగా రూ.130 కోట్ల లావాదేవీలు జరుగుతున్నట్లు వివరించారు.

పీఎస్బీ విధానంతో రైతులకు మేలు : ఏఈఓ సంగీత



నవతెలంగాణ-జన్నారం

ఫాస్ఫరస్ సాలిబిలైజింగ్ బ్యాక్టీరియా వాడకం రైతులకు మేలు చేకూరుస్తామని ఏఈఓ సంగీత అన్నారు. శుక్రవారం పొనకల్ రైతు వేదికలో రైతులకు ఫాస్ఫరస్ సోల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా గుర్చి ట్రెనింగ్ ఇచ్చారు. బ్యాక్టీరియాను ఇసుకలో పశువుల ఎరువులతో పాటు వరి నారు నాటుకునేటప్పుడు బ్యాక్టీరియా మిశ్రమంలో 10 నుండి 20 నిమిషాల పాటు ఉంచి నాటినట్లయితే బ్యాక్టీరియా భూమి లోకి వెళ్లి మొక్కకు అందని భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందజేస్తుందన్నరు. ఈ పాస్ఫరస్ సాలుబిలైజింగ్ బ్యాక్టీరియా వాడేటప్పుడు పాటించాల్సిన సూచనలు, పీఎస్‌బీ వేసిన రెండు రోజుల ముందు ఆ తర్వాత రెండు రోజులు పెస్టిసైడ్లు గాని ఫర్టిలైజర్ కానీ స్ప్రే చేయరాదని, భూమిలో వేయరాదన్నరు. పశువుల ఎరువుతో వేసినప్పుడు పశువుల ఎరువు తేమతో ఉండాలని, అందుకుగాను పీఎస్బీని పశువుల ఎరువులో కలిపి ఒక రోజు ఉంచినట్లయితే పొడిగా కాకుండా తేమ ఉండి బ్యాక్టీరియా ఎదుగుదలకు తోడ్పడుతుందన్నరు. సాలిబిలైజింగ్ బ్యాక్టీరియా వాడడం వలన డీఏపీ బస్తా వాడనవసరం లేదు ఈ విధంగా రైతు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చుని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ త్రిసంధ్య రైతులు పాల్గొన్నారు.

21న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

నవతెలంగాణ-నస్పూర్

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖాధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన యువ కళాకారులకు జానపద నృత్యం(గ్రూప్), జానపద నృత్యం(సోలో), జానపద పాట (గ్రూప్), జానపద పాట (సోలో), లైఫ్ స్కిల్స్, కాంపోనెంట్ (కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన (డిక్లమేషన్), ఫొటోగ్రఫీలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి అంశంలోని విజేతలను నిర్ణయించి ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 21న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీపీ ఫంక్షన్ హాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే యువ కళాకారులు జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనే యువతీ, యువకుల వయస్సు పోటీ నిర్వహించు నాటికి 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామాగ్రిని సంబంధిత యువ కళాకారులు తమ వెంట తెచ్చుకోవాలని, జానపద నృత్యము బృందం విభాగంలో 10 మంది సభ్యుల బృందం 15 నిమిషాల గరిష్ట కాలపరిమితి మించకుండా ప్రదర్శించాలని తెలిపారు. జానపద పాటల బృందం విభాగంలో 10 మంది సభ్యుల కంటే ఎక్కువ ఉండరాదని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. లైఫ్ స్కిల్స్ కాంపోనెంట్ (కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన (డిక్లమేషన్), ఫొటోగ్రఫీలో ప్రగతిశీల భారత్, ఆత్మనిర్భర భాత్, యోగా, క్రీడలు, ఆరోగ్యం కోసం శారీరక శ్రమ, ప్రకృతి దృశ్యం అంశాలు ఉంటాయని తెలిపారు. పోటీలలో యువజన సర్వీసుల శాఖచే నియమించబడిన న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని తెలిపారు. సంబంధిత అంశాలలో పాల్గొనే యువతీ, యువకులు యువజన సర్వీసుల కార్యాలయములో సంబంధిత సాంస్కృతిక కార్యక్రమం జరుగు స్థలము వద్ద దరఖాస్తు ఎంట్రీ కౌంటర్ల వద్ద తమ బయోడేటాను పూర్తి స్థాయిలో నింపి ఇవ్వాలని, వయస్సు ధృవీకరణ కొరకు ఎస్-ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతితో పాటు (2) రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తీసుకురావాలని తెలిపారు. ఇతర సమాచార నిమత్తము కార్యాలయము పని దినములలో మొబైల్ నెం. 9346655441లో సంప్రదించవచ్చుని, జిల్లాకు సంబంధించిన ఆసక్తి గల యువ కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి పథకాలు



నవతెలంగాణ-నస్పూర్

దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మైనార్టీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా స్త్రీ, శిశ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి కె. చిన్నయ్యతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని దివ్యాంగులకు పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, క్యారమ్, జావెలిన్ త్రో, మ్యూజికల్ చైర్ జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, సంఘాల నాయకులు మహేందర్, తిరుపతి, సతీష్, భాగ్య పాల్గొన్నారు.

పల్లె దవఖానాలో నాణ్యమైన సేవలు అందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పల్లె దవాఖానాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని ఈదులవాడ గ్రామంలో పల్లె దవాఖానను ఆయన శుక్రవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లె దవఖానాల ద్వారా ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వైద్యాధికారి సుధాకర్ నాయక్, సర్పంచ్ భీమేష్ సిబ్బంది ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో ఎంపీపీ

మండలంలోని ఈదులవడ గ్రామపంచాయితీ పరిధిలోని గొల్లగుడ గ్రామంలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవంలో ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి భీమేష్, గ్రామస్తులు రుకుం ప్రహ్లాద్, ఉప్పరి ప్రభాకర్, దేవబ్రంహం, సాగర్, శ్రీపతి, మల్లేష్, జగన్, భాస్కర్ పాల్గొన్నారు.

సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు అండగా ఉంటామని ఏఎస్పీ అచ్చేశ్వరరావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వినోద్ కుమార్ కుటుంబానికి రూ. 8,60,000 చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినోద్ కుమార్ మరణించడం బాధగా ఉందన్నారు. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం నుండి రావాల్సిన ఇతర బెనిఫిట్స్ కూడా త్వరలో వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సంఘం ప్రెసిడెంట్ ఎం.విజయ శంకర్ రెడ్డి, డీపీఓటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే టీబీజీకేఎస్ ధ్యేయం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులను కల్పించిన తమ సంఘానికి ఓటు వేసి గెలిపించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు కోరారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి పీహెచ్‌సీలో ఫిట్ కార్యదర్శి మెరుగు రమేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచారంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు కోలిండియాలో లేని ఎన్నో హక్కులను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించారన్నారు. జాతీయ సంఘం సాధించిన విధంగా హక్కులను సాధించామన్నారు. సింగరేణి కార్మికులు రానున్న ఎన్నికల్లో కార్మికులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ కొత్త హక్కులు సాధించే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బాణం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మికులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ నాయకులు మంగీలాల్, మాజీ ఉపాధ్యక్షుడు నలగొండ సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు కోగిలాల రవీందర్, మారిన వెంకటేశ్, ఏరియా నాయకులు అలవేని సంపత్, వీరస్వామి, ఫిట్ ఇన్‌చార్జీలు సదానందం, మద్రి సమ్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

18న ఆదివాసీ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బెజ్జూరు

ఆదివాసీ మండల నూతన కమిటీని 18న ఎన్నుకోనున్నట్టు నాయకులు తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఆదివాసీ భవనంలో మండలంలోని ఆదివాసీలు సమావేశం నిర్వహించారు. ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ 18న ఉదయం 10 గంటలకు ఆదివాసీ భవనంలో మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని, మండలంలోని ఆదివాసులందరు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మెస్రం రాజారాం, ఉప సర్పంచులు సంతోష్, తిరుపతి, మోహన్, మాజీ ఎంపీటీసీ నారాయణ విట్టయ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శివకుమార్ తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తమతమ నివేధికలతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామనీ, తమ పార్టీ ఆ బాధ్యతను నిర్వర్తిస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు చెప్పారు. ఈనెల 12,13,14 తేదీల్లో మూడురోజులపాటు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాలను హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన నిర్వహించారు.

కేంద్ర పరిశీలకులుగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. శుక్రవారం తనను కలిసిన విలేకర్లతో తమ్మినేని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు, పార్టీ అనుసరించిన ఎత్తుగడలు, ఫలితాలపై సమీక్షించామని చెప్పారు. తమ ఎత్తుగడలు సంతృప్తికరంగానే ఉన్నాయని అన్నారు. పోటీచేసిన 19 స్థానాల్లో గెలుస్తామని భావించకపోయినా ఓట్లు తక్కువ రావడం ప్రధాన లోపంగా పార్టీ గుర్తించిందని వివరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు నిర్ణయం కాలయాపన కావడం, చివరి నిమిషంలో పొత్తు సాధ్యం కాదని తేలాక ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని చెప్పారు. సన్నద్ధం కావడానికి సమయం సరిపోని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయని వివరించారు. బీఆర్ఎస్ మీద కోపం ఉన్న వారు కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ మీద వ్యతిరేకత ఉన్న వారు బీఆర్ఎస్‌కు ఓటేశారని చెప్పారు. సీపీఐ(ఎం) పట్ల అభిమానం ఉన్న వారు కూడా తమకు ఓటేయలేదని అన్నారు. సీపీఐ(ఎం) కుటుంబాలే ఓటేశాయి తప్ప సంప్రదాయంగా వేసే అభిమానులు ఈసారి ఓటేయలేదని వివరించారు. పార్టీ కమిటీలు, శాఖల్లోనూ గణనీయంగా లోపాలు జరిగాయని అన్నారు. ఈ లోపాలను సమీక్షించుకుని భవిష్యత్తులో పార్టీని పటిష్టం చేయడానికి అవసరమైన నిర్ణయాలు చేశామని చెప్పారు.

2 గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి వారంలోనే రెండు గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామమని తమ్మినేని చెప్పారు. వివిధ శాఖలపై సమీక్షలు, లోపాలను గుర్తించడం, వాటిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించడం సానుకూల సంకేతమని అన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి చేసిన వాగ్దానాలను అమలు జరపాలని కోరారు. ప్రజాస్వామికంగా పాలన అందించాలని సూచించారు. అలా జరుగుతుందని ఆశిస్తున్నామని చెప్పారు.

కేసీఆర్ గాయపడడం బాధాకరం

ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గాయం కావడం, తుంటి ఎముక విరగడం, ఆస్పత్రిలో చేరడం, ఆపరేషన్ జరగడం బాధాకరమని తమ్మినేని అన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

ఇటీవల సంభవించిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని తమ్మినేని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకునే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు. వాయిదా పడిన పోటీ పరీక్షలను నిర్వహించాలని సూచించారు.

నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, గ్రామీణ పేదల విషయంలో కాంగ్రెస్ వాగ్దానాలను అమలు చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని అన్నారు.

ప్రజలకు కృతజ్ఞతలు

ఈ ఎన్నికల్లో పార్టీ కోసం రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు తమ్మినేని ధన్యవాదాలు చెప్పారు. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్న ఈ తరుణంలోనూ పార్టీని ఆదరించి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు ప్రకటించారు.

బీఆర్ఎస్‌ను ఓడించాలనుకున్న ప్రజలు

రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామనీ, వివిధ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దామని చెప్తూ బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లిందని తమ్మినేని అన్నారు. అయితే అభివృద్ధి కంటే ఈ పదేండ్ల కాలంలో వారి అహంభావం, అప్రజాస్వామిక ధోరణులను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌ను ఓడించాలని భావించారని అన్నారు. బీఆర్ఎస్‌పై వ్యతిరేకత కాంగ్రెస్‌కు దోహదపడిందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర, రేవంత్‌రెడ్డి నాయకత్వం, కర్నాటకలో విజయం, అధిష్టానం చొరవ, కాంగ్రెస్‌లో గ్రూపులన్నీ ఏకం కావడం వంటి పరిణామాలన్నీ కాంగ్రెస్ గెలుపునకు తోడ్పడ్డాయని వివరించారు.

బీజేపీ గెలుపుపై లౌకికశక్తులు అప్రమత్తంగా ఉండాలి

మునుగోడు ఎన్నికల ముందు ప్రదర్శించిన జోరు ఆ ఫలితాల తర్వాత బీజేపీలో కనిపించలేదని తమ్మినేని అన్నారు. గత ఎన్నికలతో పోల్చితే బీజేపీకి ఓట్లు, సీట్లు రెట్టింపయ్యాయనీ, ఇది ఓ ప్రమాదకర సంకేతమని చెప్పారు. రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడడానికి ఇది సంకేతంగా ఉందన్నారు. లౌకికశక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే కాలంలో తమ పార్టీ ఆ దిశగా చొరవ చూపుతుందని అన్నారు.

సెంట్రమ్ మల్టీవిటమిన్, ప్రోటీన్ పౌడర్‌ల అంబాసిడర్‌గా నటీ కాజల్ అగర్వాల్

నవతెలంగాణ - హైదరాబాద్

ప్రపంచంలోనే నంబర్ 1 మల్టీవిటమిన్ బ్రాండ్ చసెంట్రమ్, భారతదేశంలో తన కొత్త శ్రేణి మల్టీ విటమిన్ మరియు ప్రొటీన్‌ల శ్రేణిని విడుదల చేసేందుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నటి, ఎంటర్‌ప్రెన్యూర్ కాజల్ అగర్వాల్‌ను ప్రకటించింది. పలువురు భారతీయులకు వారి మొత్తం పోషకాహార అవసరాల గురించి తెలియకపోవచ్చు. నిజానికి, 10 మంది భారతీయులలో 8 మంది మల్టీవిటమిన్ లోపంతో సమస్యలు ఎదుర్కొంటూ ఉండేందుకు అవకాశం ఉందిలి. కాజల్‌తో కలిసి సెంట్రమ్ క్యాంపెయిన్ సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను, పోషకాహార అంతరాలను భర్తీ చేసేందుకు ఆహారంతో పాటు మల్టీవిటమిన్‌లను చేర్చడాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది సెంట్రమ్ మద్దతుతో కాజల్ తన బహుళ పాత్రలను అంతరాయం లేకుండా నిర్వహించడాన్ని హైలైట్ చేస్తుంది.

రాష్ట్రంలో 40,000 మంది విద్యార్థులకు విస్తరించిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రామ్

నవతెలంగాణ - హైదరాబాద్

తెలంగాణలో తమ "అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్" కార్యక్రమాన్ని విస్తరిస్తున్నట్లు ప్రకటించింది, ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ భాగస్వామ్యంతో 31 జిల్లాల్లోని 120 ప్రభుత్వ పాఠశాలలకు ఈ కార్యక్రమం తీసుకువస్తుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం 40,000 మంది పాఠశాల పిల్లలను చేరుకోవడం, డిజిటల్ యుగంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలు మరియు జ్ఞానంతో వారికి సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.

కార్యక్రమం రెండు ప్రధాన అంశాలపై దృష్టి పెడుతుంది: ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా జ్ఞానాన్ని బలోపేతం చేయడం: వ్యక్తిగతీకరించిన అభ్యాస వేదిక, మైండ్‌స్పార్క్ ద్వారా, ఐదు నుండి తొమ్మిది తరగతుల విద్యార్థులు గణితం మరియు భాషలలో అభ్యాస అంతరాలను తగ్గించడానికి తగిన సూచనలను అందుకుంటారు.

కంప్యూటర్ సైన్స్ కాన్సెప్ట్‌లను పరిచయం చేయడం: code.org నుండి ఎంగేజింగ్ వర్క్‌బుక్‌లు మరియు ఇంటరాక్టివ్ అవర్ ఆఫ్ కోడ్ కార్యకలాపాలు విద్యార్థులకు సీక్వెన్సింగ్, లూప్‌లు మరియు ఎన్‌కోడింగ్ వంటి అవసరమైన కోడింగ్ కాన్సెప్ట్‌లను పరిచయం చేస్తాయి.

100+ హెచ్‌డీ ఛానెల్‌లను ప్రారంభించిన మొదటి ప్లాట్‌ఫారమ్ టాటా ప్లే

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలో అతిపెద్ద కంటెంట్ పంపిణీ ప్లాట్‌ఫారమ్ టాటా ప్లే, ఇప్పుడు 100o హెచ్‌డి ఛానెళ్లను ప్రసారం చేస్తున్న మొదటి డిటిహెచ్ కంపెనీగా అవతరించి, మరో మైలురాయిని చేరుకుంది. దేశంలో మొట్టమొదటి డిమాండ్-ఆధారిత ఉపగ్రహం జీఎస్ఏటీ-24 సేవలు అందుబాటులోకి వచ్చిన అనంతరం, టాటా ప్లేకు దేశంలో అతిపెద్ద స్యాటిలైట్ బ్యాండ్‌విడ్త్ లభించింది. తాము కొత్తగా చేరుకున్న మైలురాయి గురించి టాటా ప్లే మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హరిత్ నాగ్‌పాల్ మాట్లాడుతూ, "ఎప్పటికప్పుడు వృద్ధి చెందుతున్న మా చందాదారుల ఇన్ఫోటైన్‌మెంట్ అవసరాలకు అనుగుణంగా అత్యుత్తమ నాణ్యతతో కూడిన పిక్చర్, శబ్దంతో అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. మా వీక్షకుల కోసం బ్రాడ్‌కాస్టర్‌లు హెచ్‌డీలో మరిన్ని ఛానెళ్లను అందుబాటులోకి తీసుకురావాలని మేము కోరుతున్నాము" అని తెలిపారు.

పొన్నంకు వృత్తిసంఘాల శుభాకాంక్షలు..



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చేతి వృత్తి సంఘాల సమన్వయ కమిటీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం కృష్ణస్వామి, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిలు తదితరులు మంత్రిని కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో వృత్తి దారులకిచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పౌరసరఫరాలపై మంత్రి సమీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో మహాలక్ష్మి పథకం కింద రూ.500కు వంట గ్యాస్ సిలెండర్ ఇచ్చే అంశంపై ఉన్నతాధికారులతో పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. శుక్రవారం సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణ, రేషన్ లబ్దిదారులకు నాణ్యమైన బియ్యం సరఫరా తదితర అంశాలపై చర్చించారు.

1,800 నర్సింగ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- మంత్రి దామోదర తొలి సంతకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,800 నర్సింగ్ పోస్టులను భర్తీ చేసేందుకు వీలుగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత ఫైలుపైతొలి సంతకం చేశారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖలో 7 వేలకు పైగా ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశలలో ఉన్న సంగతి తెలిసిందే..గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చెయ్యాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు నియామక ప్రక్రియను చేపట్టిన సంగతి విదితమే.ఇందులో భాగంగా 5,204 మంది స్టాఫ్ నర్సుల నియామకానికి ఉద్యోగ ప్రకటన వెలువడింది. సుమారు 40 వేల మందికిపైగా దరఖాస్తు చేసుకోగా, రాత పరీక్ష నిర్వహించి 'కీ'ని కూడా విడుదల చేసింది. ఆ నియామకాలను వెంటనే చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





ఆత్మహత్యకు అనుమతించండి

సహచరుల లైంగిక వేధింపులతో జీవితంపై విరక్తి : మహిళా జడ్జి లేఖ

- స్పందించిన సుప్రీం, నివేదిక కోసం ఆదేశాలు జారీ



న్యూఢిల్లీ : తన ఆత్మహత్యకు అనుమతి నివ్వాలంటూ ఉత్తరప్రదేశ్‌లోని ఒక మహిళా న్యాయమూర్తి రాసిన బహిరంగ లేఖపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ శుక్రవారం స్పందించారు. మహిళా జడ్జి చేసిన ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ అతుల్ ఎం. కుర్హేకర్ అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బహిరంగ లేఖను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు సెక్రెటరీ జనరల్ పేర్కొన్నారు. "నా జీవితాన్ని గౌరవప్రదంగా ముగించుకోవడానికి నన్ను అనుమతించండి. నా జీవితాన్ని అంతం చేసుకోనివ్వండి " అని బందాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తి చీఫ్ జస్టిస్‌కు రాసిన బహిరంగ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. బారాబంకిలో పనిచేస్తున్న సమయంలో జిల్లా జడ్జి అతని సహచరులు తనపై లైంగిక వేదింపులకు పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. " నేను చాలా తీవ్రంగా లైంగిక వేధింపులకు గురయ్యాను. నన్ను పురుగుకంటే హీనంగా చూస్తున్నారు. గౌరవప్రదంగా నా జీవితాన్ని అంతం చేసుకునేందుకు అనుమతించండి " అని ఆ లేఖలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఏడాది జులైలో తాను హైకోర్టు అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశానని, విచారణకు ఆదేశించారని అయితే ఆ విచారణ ఓ "ప్రహసనం, బూటకం" అని పేర్కొన్నారు. సాక్షులు జిల్లా జడ్జికి సబార్డినేట్‌లని, తమ యజమానికి వ్యతిరేకంగా వారు సాక్ష్యమిస్తారని కమిటీ ఎలా భావించిందో, నా అవగాహనకు కూడా అందడం లేదు " అని పేర్కొన్నారు. విచారణ సక్రమంగా జరిగేలా దర్యాప్తు పూర్తయ్యేంతవరకు అతనిని బదిలీ చేయాలని సుప్రీంకోర్టును కోరానని, అయితే కేవలం ఎనిమిది సెకన్ల వ్యవధిలోనే తన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిందని తెలిపారు. ఇక తనకు జీవించాలనే కోరిక లేదని, గత ఏడాదిన్నర కాలంగా తనను నడిరోడ్డుపై పడేశారని, ప్రాణం లేని, నిర్జీవమైన ఈ శరీరాన్ని ఇలా మోయడం వల్ల ప్రయోజనం లేదని, తన జీవితానికి ఎలాంటి లక్ష్యం లేదని రెండు పేజీల సుదీర్ఘ లేఖలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ

లైంగిక వేధింపులకు పాల్పడు తున్నారంటూ బాధితులురాలు ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే చర్య తీసుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ కోరింది. న్యాయ వ్యవస్థలతో సహా అన్ని వ్యవస్థల్లోనూ పిఓఎస్‌హెచ్ చట్టాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎఐసిసిడబ్ల్యుడబ్ల్యు కన్వీనర్ ఎ.ఆర్.సింధూ ఒక ప్రకటనలో కోరారు. ఉన్నత స్థాయిలో వున్న మహిళా న్యాయమూర్తిపైనే ఇటువంటి వేధింపులు జరగడం పట్ల సీఐటీయూ, మహిళా సబ్ కమిటీ, అఖిల భారత వర్కింగ్ వుమెన్ సమన్వయ కమిటీ ఆవేదన వ్యక్తం చేశాయి. లైంగిక వేధింపులతో కలిసి జీవించడమెలాగో భారతదేశంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులకు తెలియచేయాలనుకుంటున్నట్లు ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. అసంఘటిత రంగంలో పని ప్రదేశాల్లో పిఓఎస్‌హెచ్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తూనే వుందని గుర్తు చేశారు. ఈ కేసులో దర్యాప్తుకు చీఫ్ జస్టిస్ ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నేరుగా వేతనాలివ్వాలి

మంత్రి తుమ్మలకు వినతి

తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించి ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, మార్కెట్ కమిటీల ద్వారా నేరుగా వేతనాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్(సీఐటీయూ) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తుమ్మల నాగేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సుమారు 182 వ్యవసాయ మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టుల్లో సుమారు 1,200 సెక్యూరిటీ గార్డులు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పద్ధతుల్లో పని చేస్తున్నారని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో రైతుల సరుకులను రక్షించడం, చెక్‌పోస్టుల్లో వ్యవసాయ, దినుసుల రవాణా వాహనాలను ఆపి తనిఖీ చేసి స్వయంగా ఆన్‌లైన్ ద్వారా రశీదు జారీ చేసి, మార్కెట్ ఫీజు వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేయడంతో పాటు ఆదాయం పెంచడంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వారు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, నేరుగా మార్కెట్ కమిటీల నుంచే వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రికి వారు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సారిక రాము, ఉపాధ్యక్షులు జి, లక్ష్మణ్, బలీ సదయ్య, ముస్తాక్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్. రమేష్, వై. రామాంజయ్య, బి. మహేందర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్, లక్ష్మయ్య, జె. పాండురంగారావు, కె. దీక్షిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దుర్మరణం

చెరుకువాడలో రోడ్డు ప్రమాదం

- తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మతి
- ఏపీ రాష్ట్ర క్యాబినెట్, చంద్రబాబు, సీపీఐ(ఎం) సంతాపం



భీమవరం: ప్రజా ఉద్యమాల ముద్దుబిడ్డ ఉభయ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తుది శ్వాస విడిచారు. ఉండి మండలం చెరుకు వాడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. ఏలూరు జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం బయలుదేరిన ఎమ్మెల్సీ సాబ్జీ ఆకివీడులో నాలుగు రోజుల నుంచి జరుగు తున్న అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపి భీమవరం వస్తుండగా చెరుకువాడ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జు నుజ్జు అయింది. వ్యాగన్ ఆర్ కార్లో ఎదుర సీట్లో కూర్చున్న సాబ్జీకి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడి నుంచి పోలీస్ వాహనంలో భీమవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. ప్రజానీకం సందర్శనార్థం సాబ్జీ మృత దేహాన్ని భీమవరం ఆస్పత్రిలో ఉంచారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ రాజు, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా ఎస్పీ రవి ప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, భీమవరం ఆర్డీవో శ్రీనివాసులు రాజు సాబ్జీకి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బి బలరం, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి గోపి మూర్తి, సీఐటీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్వి గోపాలన్, కే రాజా రామ్మోహన్ రాయ్, యుటిఎఫ్ నేతలు, కార్మిక వర్గం అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, కార్మికులు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాస్వామ్య శక్తులకు బాధాకరమైన అంశం : పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి పట్ల పీడీఎఫ్ ఏపీ ఎమ్మెల్సీల తరపున కేఎస్ లక్ష్మణ్ రావు, ఐ వెంకటేశ్వరరావు సంతాప ప్రకటించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయుడుగా ఉద్యమ నాయకుడిగా పనిచేస్తూ సాబ్జి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అనేక ఉద్యమాలలో భాగస్వామి అయ్యారని తెలిపారు. 2021 మార్చిలో తూర్పు గోదావరి పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజక వర్గం నుండి శాసనమండలికి జరిగిన ఎన్నికలలో ఘన విజయం సాధించారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు : పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ సంతాపం ప్రకటించారు. సాబ్జి మృతి యూటీఎఫ్ ఉద్యమానికి, ఉపాధ్యాయుల ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మరణం ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ దిగ్భ్రాంతి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు షేక్ సాబ్జీ శుక్రవారం మధ్యాహ్నం పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. చురుకైన నాయకుడు, సమరశీల ఉద్యమకారుడు సాబ్జీ మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ప్రజాఉద్యమాలకు తీరని లోటు : బి వెంకట్

ఉపాధ్యాయ ఉద్యమ నేత, యూటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ మరణం కలచి వేసిందని ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. సుదీర్ఘకాలంగా ఆయనతో పరిచయాలు ఉన్నాయనీ, ఆయన అకాల మరణం వారి కుటుంబంతో పాటు ప్రజా ఉద్యమాలకు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌కు తీరనిలోటన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలు అనేకం ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు, యూటీఎఫ్ రాష్ట్ర కమిటీకి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఇనార్బిట్ మాల్ క్రిస్మస్ వేడుకలకు సిద్ధం

నవతెలంగాణ - హైదరాబాద్



ఈ సంవత్సరంలో చాలా కాలంగా ఎదురుచూస్తున్న సీజన్‌ను వేడుకగా జరుపుకోవడానికి సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌కి వెళ్లడానికి సిద్ధంగా ఉండండి. క్లిష్టంగా రూపొందించబడిన మాల్ డెకర్ ఇన్‌స్టా-విలువైన క్షణాల కోసం పరిపూర్ణమైన అనేక ఫోటో-ఆప్‌లను అందిస్తుంది. క్రిస్మస్ చెట్టు చుట్టూ వినూత్నమైన చిట్టడవి లాంటి ఇన్‌స్టాలేషన్ అద్భుతానికి తక్కువ ఏమీ లేదు. అందమైన రెయిన్‌డీర్‌లు, నట్‌క్రాకర్‌లతో అలంకరించబడిన సౌరంగంలోకి ప్రవేశించి క్రిస్మస్ మాయాజాలాన్ని అనుభవించవచ్చు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా నిర్వహించబడిన వర్క్‌షాప్‌లు, కార్యకలాపాల ఉత్తేజకరమైన లైనప్ కూడా ఉంది. డిసెంబర్ 16, 17 తేదీల్లో, సందర్శకులు క్యారికేచర్, మాగ్నెట్-మేకింగ్ వర్క్‌షాప్‌లు, మరిన్నింటిలో పాల్గొనవచ్చు.

బడ్జెట్ సెగ్మెంట్లో ఐటెల్ ఏ05 లాంచ్

నవతెలంగాణ - హైదరాబాద్



భారత్‌కు చెందిన ప్రము ఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ఐటెల్ తన తాజా స్మార్ట్‌ఫోన్, ఐటెల్ ఏ05ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఆకర్షణీయంగా రూ 6,099 ధరతో ఏ05 ఎస్ పెద్ద 6.6-అంగుళాల హెచ్‌ం డ్రాప్ డిస్ప్లే, 4000 మెగాహెడ్జెస్ బ్యాటరీ, 8 ఎంపి ఏఐ కెమెరాలు మరియు మరిన్ని ఫీచర్లతో పంచ్ను ప్యాక్ చేస్తుంది. ఏ05 ఎస్ క్రిస్టల్ బ్లూ, గ్లోరియస్ ఆరెంజ్, మేడో గ్రీన్, నెబ్యులా బ్లాక్. నాలుగు అందమైన రంగు ఎంపికలలో స్లిమ్ బాడీని కలిగి ఉంది కాలింగ్, వెబ్ బ్రౌజింగ్, వీడియో చూడటం, సాధారణ గేమింగ్ మరియు మరిన్ని రోజువారీ పనుల కోసం సున్నితమైన పనితీరును అందిస్తుంది. ఇది శక్తి వినియోగదారుల కోసం ఉదారంగా 4000 మెగాహెడ్జెస్ బ్యాటరీని ప్యాక్ చేస్తుంది, అయితే ఇది ఉదారంగా 64 జిబి ర్యాం అత్యంత తీవ్రమైన మీడియా ఔత్సాహికులను ఎనేబుల్ చేస్తుంది. లాంచ్లో ఐటెల్ ఇండియా సీఈఓ అరిజీత్ తలపాత్ర మాట్లాడుతూ, శైలి, రోజువారీ వినియోగం యొక్క ఖచ్చితమైన సమ్మేళనాన్ని అందించే కొత్త 05 లను విడుదల చేయడం పట్ల మేము సంతోషిస్తున్నాము. డిజిటల్ ఇండియా కార్యక్రమాలను కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు మా ప్రయత్నాలకు ఏ05 పరాకాష్ట. బెస్ట్-ఇన్-క్లాస్ డిస్ప్లే బ్యాటరీ, కెమెరాలు, నాలుగు ఆకర్షణీయమైన రంగులలో అత్యాధునిక డిజైన్తో ప్యాక్ చేయబడిన ఏ05 ఎస్ సరసమైన ఇంకా ఫీచర్-లోడ్ చేయబడిన పరికరం కోసం వెతుకుతున్న వినియోగదారులను ఆకట్టుకుంటుంది అని అన్నారు.

మాకు ఛాంబర్స్ కేటాయించండి

- స్పీకర్ జి.ప్రసాద్ కుమార్‌కు బీజేపీ ఎమ్మెల్యేల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ లాబీలో, బయట కూడా తమకు ఛాంబర్ కేటాయించాలని బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారి వినతి మేరకు పలు గదులను వారిని పరిశీలించాల్సిందిగా సూచనలు చేసినట్టు తెలిసింది. గతంలో బీజేపీ ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా గది కేటాయించలేదు. అసెంబ్లీ నియమ, నిబంధనల ప్రకారం ఒక పార్టీ నుంచి కనీసం ఐదుగురు సభ్యులుంటేనే గది కేటాయిస్తారనే నిబంధన ఉండటంతో గతంలో వారికి గది కేటాయించలేదు. ఇప్పుడు బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలున్న నేపథ్యంలో వారికి లాబీతో పాటు బయట కూడా బీజేపీ ఎల్పీ ఛాంబర్ కేటాయించనున్నారు.

బీజేపీలో కుంపట్లు

- బండి సంజయ్‌కి వ్యతిరేకంగా సీనియర్ల తిరుగుబావుటా
- నేడు సంజయ్ ఆధ్వర్యంలో పార్లమెంట్‌స్థాయి నాయకుల సమావేశం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీలో కుంపట్లు కొనసాగుతున్నాయి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు సీనియర్లు బండి సంజయ్‌పై తిరుగుబావుటా ఎగరవేశారు. సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఒంటెద్దు పోకడతో పార్టీని 'బండి' బలహీనపరిచారంటూ రెండ్రోజుల కిందట సమావేశమై సంజయ్ పట్ల వ్యతిరేకగళం విప్పారు. దీనికితోడు పార్టీలో వ్యక్తిపూజ ఎక్కువైందని, బీజేపీలో అందరూ సమానమేనంటూ సంజయ్‌నుద్దేశించి ఇటీవల దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలూ వైరల్‌గా మారాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న సీనియర్లంతా అసెంబ్లీ ఎన్నికల్లో సంజయ్ ఓటమి తరువాత మళ్లీ ఒక్కటై వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఆయనకు అవకాశం ఇవ్వొద్దంటూ తీర్మానించి, ఆ పార్టీ అధిష్టానానికి పంపేందుకు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో నేడు కరీంనగర్ పార్లమెంట్ స్థాయి శ్రేణులతో సంజయ్ సమావేశం ఏర్పాటు చేయడం ఆ పార్టీలో కలకలం రేపుతోంది.